# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 14-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **విశాఖపట్నంలో 'బిమ్స్ టెక్' పోర్టుల సదస్సును కేంద్ర ఓడ రేవులు శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ ఈరోజు ప్రారంభించారు.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఏపీ ఫైబర్ నెట్ సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**

**3.** **ఈగల్ బృందాల ద్వారా రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హోంశాఖ మంత్రి వి. అనిత తెలిపారు.**

**4.** **ప్రజల అవసరాలకు తగినట్లుగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

**5.** **ప్రముఖ చలన చిత్ర నటి బి.సరోజాదేవి ఈ రోజు కన్నుమూశారు.**

=========================

భారత ఓడ రేవులు ప్రపంచ వాణిజ్య సరఫరా వ్యవస్థకు ఆధునిక చిహ్నాలుగా నిలుస్తున్నాయని కేంద్ర ఓడ రేవులు, షిప్పింగ్ జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. బంగాళాఖాతం ప్రాంతంలో బహుళ రంగాల సాంకేతిక , ఆర్థిక సహకార సదస్సు-'బిమ్స్ టెక్' పోర్టుల సదస్సు విశాఖపట్నంలో ఈరోజు ప్రారంభమైంది. 'నీలి ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణ, స్థిరమైన భాగస్వామ్యాలు' శీర్షికతో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతోంది. ఈ కార్యక్రమానికి భారత్ సహా బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయిలాండ్ దేశాల ప్రతినిధులు హాజరైయ్యారు. ఈ సదస్సును కేంద్రమంత్రి ప్రారంభించి మాట్లాడుతూ,

వాయిస్ 35 సెకన్లు

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో ఏపీ ఫైబర్ నెట్ విస్తరణ, కొత్త ఫైబర్ నెట్ కనెక్షన్లు ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ, స్వచ్ఛాంధ్రపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

అన్నమయ్య జిల్లాలో గత రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో 9 మంది మృతి చెందటం పట్ల రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని తెలిపారు.

మరో వైపు రాజంపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈ రోజు పరామర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 31 సెకన్లు

---------------------------

ఈగల్ బృందాల ద్వారా రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హోంశాఖ మంత్రి వి. అనిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలను రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈగల్ బృందాల ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

మంగళగిరిని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో 4 కోట్ల రూపాయలతో ఐదు అధునాతన వాహనాలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళగిరిలోని రహదారును గుంతలు లేకుండా తీర్చిదిద్దేలా అధునాతన పాట్ హోల్ రోడ్ రిపేర్ వాహనాన్ని, చెత్తను తరలించేందుకు రెండు రిఫ్యూజ్ కాంపాక్టర్ మెషిన్ వాహనాలను ఏర్పాటు చేశామని చెప్పారు. స్వచ్ఛ మంగళగిరికి ఈ అధునాతన వాహనాలు దోహదపడనున్నాయని మంత్రి వివరించారు.

---------------------------

ప్రజల అవసరాలకు తగినట్లుగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో 3కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ, ఈ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణంతో కనిగిరి పట్టణంతో పాటు పునుగోడు పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటివరకూ 12 సబ్ స్టేషన్లను మంజూరు చేశామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రముఖ చలన చిత్ర నటి, పద్మభూషణ్ గ్రహీత బి.సరోజాదేవి ఈరోజు కన్నుమూశారు. ఆమె వయస్సు 87 సంవత్సరాలు. కర్నాటకలోని బెంగళూరులో తన నివాసంలో ఈ ఉదయం తుదిశ్వాస విడిచారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. బి. సరోజాదేవి తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, ఎంజీ రామచంద్రన్ వంటి నటులతో పలు సినిమాల్లో నటించారు. 1938లో కర్ణాటకలో జన్మించిన సరోజాదేవి 200కు పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 1955లో 'మహాకవి కాళిదాస' అనే కన్నడ సినిమాతో చలన చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. 1959లో వచ్చిన 'పెళ్లిసందడి' సినిమాతో తెలుగులో ఆమె తొలిసారిగా నటించారు. పాండురంగ మహత్యం, సీతారామ కల్యాణం, జగదేకవీరుని కథ, శ్రీకష్ణార్జున యుద్ధం, దాగుడు మూతలు వంటి పలు తెలుగు సినిమాల్లో నటించారు. సినీ రంగానికి బి.సరోజాదేవి చేసిన సేవలకు గాను కేంద్రప్రభుత్వం ఆమెను 1969లో పద్మశ్రీతో, 1992లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

కాగా బి.సరోజాదేవి మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 426 పాయింట్ల నష్టంతో 82 వేల 73 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 123 పాయింట్ల నష్టంతో 25 వేల 26 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలో వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు తేలిక పాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

========================